# ఆవిష్కరణ



అది కొత్తగా కట్టిన కాలనీ.

ప్రభుత్వం తన ఉద్యోగులకు ఇళ్లు కట్టుకోవడానికి అప్పులు ఇయ్యసాగింది. ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని అనేకమంది ప్రభుత్యోగులు అక్కడ స్థలాలు కొనుక్కొని ఇళ్లుకట్టుకోసాగారు. చూస్తూండగానే కొత్త కాలనీ రూపురేఖలు దిద్దుకొని విస్తరించసాగింది.

ఇంతలో... సిమెంటుకీ, ఇనుముకీ కొరత ఏర్పడింది. దానిమూలంగా ఇళ్ల నిర్మాణం బాగా మందగించింది. పునాదులతో ఆగిపోయిన ఇళ్లు, మొండిగోడలు మించి పైకి లేవని

ఇళ్లతో ఆ కాలనీ పురాతత్వ శాఖవారు త్రవ్వి తీసిన ఏదో ప్రాచీన నగరపు అవశేషాలను పోలి ఉంది. అయినప్పటికీ అప్పటివరకు ఆ కాలనీలో 60, 70 ఇళ్లకు పైగా లేచాయి. ఆ కాలనీకి అటూఇటూ కూడా నగరం విస్తరించి ఉండడంచేత ఈ కొత్త కాలనీ కూడా అచిరకాలంలోనే అభివృద్ధి చెందే సూచనలు గోచరిస్తూనే ఉన్నాయి.

ఆరోజు ఆ కాలనీ సంక్షేమ సంఘం సర్వ సభ్య సమావేశం జరుగుతోంది.

సభ్యులంతా కాలనీకి కావలసిన అవసరాలను గురించి, వాటిని త్వరితంగా నెరవేర్చుకోగల పద్ధతుల గురించీ సుదీర్ఘంగా చర్చలు జరిపారు.

సంఘ వార్షికోత్సవం కేవలం ఒక నెలరోజులలోనే ఉంది కనుక ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ఏ మంత్రిగారినో పిలిచి వారిని 'ఖుషామత్' చేసి వారిముందు కాలనీకి కావలసిన అవసరాల గురించి వినతి పత్రం సమర్పిస్తే ఫలితం చిక్కుతుందని పలువురు సభ్యులు అభిప్రాయపడ్డారు.

సభ్యుల సూచన మేరకు చివరికి మంత్రిగారిని పిలవాలని నిర్ణయించడం జరిగింది.

ఆ నిర్ణయం తీసుకున్న తర్వాత ఏ మంత్రిగారిని పిలవాలనే సమస్య వచ్చింది. అన్నిటికన్నా ముఖ్యమైనది త్రాగేనీరు కనుక త్వరగా పంపులు పడాలంటే పురపాలక శాఖామాత్యులను పిలవాలని సభ్యులలో ఒక వర్గం అభిప్రాయపడింది. కాలనీకి రోడ్డూ, డ్రయినేజి కూడా చాలా అవసరమని, అందువల్ల వారినే పిలిస్తే ఈ మూడింటి విషయం ఆయన చూడగలరని వారు బల్లగుద్ది వాదించారు.

అయితే... ఈ కాలనీ ఉన్న ప్రాంతం పంచాయతీలో ఉంది కనుక పురపాలక శాఖామాత్యులను పిలిస్తే ఫలితం ఏమి ఉంటుందని సభ్యులలో ప్రత్యర్థివర్గం వారు ఒక కుశంకను లేవదీశారు. ఈ కారణంచేత పంచాయతీ శాఖామంత్రిగారిని పిలవడం ఎంతైనా సబబని వారు గట్టిగా వాదించారు.

ఈ కాలనీ ఉన్న ప్రాంతానికి రెండు వైపులా మున్సిపల్ కార్పోరేషన్ వారికి చెందిన ప్రాంతాలు ఉన్నాయని, నగర బృహత్ విస్తరణ కార్యక్రమం క్రింద ఈ కాలనీప్రాంతాన్ని కార్పోరేషన్ వారు స్వాధీన పరచుకోవాలని ఏనాడో నిర్ణయం తీసుకోవడం జరిగిందనీ, ఆ నిర్ణయం ఏనాడైనా అమలు జరుపబడగలదనీ, అందువల్ల పంచాయతీ శాఖామంత్రిని పిలవడం దండగ అవుతుందని మొదటివర్గం వారు గట్టిగా వాదించారు.

ప్రభుత్వంతో వ్యవహారం- 'ఇదుగో...' అంటే ఆరేళ్లనీ, వారి నిర్ణయం ఇప్పట్లో అమలు జరిగేది కాదనీ, అందువల్ల మున్సిపాలిటీవారి మీద అనవసరపు ఆశలు పెట్టుకోవడం అర్థంలేనిదనీ, ప్రత్యర్థివర్గం వారు అంతకంటే గట్టిగా వాదించారు.

తర్జన భర్జనలతో ప్రారంభమైన వాద- ప్రతివాదాలు అంతకంతకు తీవ్రమై సిగపట్ల వరకు రాబోయాయి. ఆ పరిస్థితి వచ్చేసరికి సభ్యులలో మూడో వర్గం ఒకటి బయలుదేరింది.

"అయ్యా...! త్రాగడానికి నీరు చాలా ముఖ్యమే. పంపులు ఉండడం ఎంతైనా అవసరమే. అయినా ప్రస్తుతానికి ప్రతి ఇంట్లోనూ నూతులు ఉండడంవల్ల కొంచెం కష్టమైనా నీటికి ఇబ్బంది లేదు. అలాగే ఇంచుమించు ప్రతివారూ సెప్టిక్ ట్యాంకులు కట్టుకోవడంతో డ్రెయినేజీ వెంటనే లేకపోయినా కలిగే ప్రమాదమూ లేదు. అలాగే రోడ్డు అంటారా... ఇప్పటికైతే కచ్చారోడ్లు ఉండనే ఉన్నాయి. సైకిళ్ల వరకు రావడానికి ఇబ్బంది లేదు. ఏ గతుకులు ఉన్నా- వానలు వస్తే బాధ కాని, ఇప్పటికైతే ఎలాగో గడిపేయవచ్చు. మనకి ముఖ్యంగా లేనిది... వీధి దీపాలు. ఇవి లేకపోవడంతో రాత్రుళ్లు కొంపకి చేరడమంటే ప్రాణాంతకంగా ఉంటోంది. ఎదురుగుండా ఎవరు వచ్చేదీ, ఏమున్నదీ కూడా తెలియడం లేదు. సైకిల్‌కి లైటు లేకపోతే ఇంక ఆ అవస్థ చెప్పనక్కరలేదు. కాబట్టి మనం విద్యుచ్ఛక్తి శాఖామాత్యులను పిలిచి వీధిదీపాల కోసం వినతి పత్రం సమర్పించడం మంచిది" అని వారు ఉద్ఘాటించారు.

ఈ వాదన అందరికీ నచ్చింది. పైగా... సిగపట్లని తప్పించింది. అందువల్ల సభ్యులందరూ విద్యుచ్ఛక్తి శాఖామాత్యులను పిలవాలని ఏకగ్రీవంగా నిశ్చయించారు.

ఈ విషయంలో కూడా సభ్యులలో విభిన్న అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. సభ్యులు సూచించిన పేర్లలో వారివారి శక్తి సామర్థ్యాల మీదా, పలుకుబడుల మీదా విభిన్న అభిప్రాయాలు వెల్లడి కావడంతో, ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఆ విషయాన్ని మరొక వారంలో తిరిగి సమావేశం జరిపి ఆ లోటు నిర్ణయించాలనే సూచనను ఆమోదించారు.

తర్వాత మంత్రిగారిని పిలవడానికి అందుకుగాను పలుకుబడిగల వ్యక్తిని పట్టుకోవడానికి ఎవరిని నియమించాలి?... అనే విషయమై చర్చ వచ్చింది. సభ్యులలో కొందరు అధ్యక్షులు, కార్యదర్శి ఉండగా ఎవరిని నియమించాల్లనే ప్రసక్తి ఏమిటని ఆక్షేపించారు.

అధ్యక్ష, కార్యదర్శి పదవులకు వ్యక్తులున్నంతమాత్రాన అలాంటి ముఖ్యమైన కార్యాల్లో వారినే నియమించాల్సిన అవసరం లేదనీ, అలాంటి వారికి కార్యాలు సాధించుకు రాగల చాకచక్యం ఉండాలని అంటూ పరోక్షంగా అధ్యక్ష, కార్యదర్శుల శక్తి సామర్థ్యాలపై సంశయాన్ని వెలిబుచ్చారు ఒక వర్గంవారు.

ఈ విషయంలోకూడా వాదోపవాదాలు తీవ్రస్థాయికి చేరబోయేసరికి సభ్యులలో ఒకరు 'ఎవరి ద్వారా మంత్రిగారిని పట్టుకోవాలా?... అనే విషయమే తేలనప్పుడు-

అందుకోసం ఎవరిని పంపాలా?... అనే విషయంపై చర్చ అసంబద్ధం' అంటూ పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవదీశారు. అంతటితో ఆ విషయంపై నిర్ణయం కూడా వచ్చే సమావేశానికి వాయిదా వేశారు.

అంతటితో ముఖ్యమైన నిర్ణయాలు ఏవీ తీసుకోకుండానే ఆనాటి సమావేశం మరుసటి వారానికి వాయిదా పడింది.

* * *

మరుసటి వారం మళ్లీ సభ్యులు సమావేశం అయ్యారు.

అయితే ఈసారి క్రిందటి సమావేశంలో ఉత్సాహంగా మాట్లాడిన సభ్యులలో చాలామంది రానేలేదు. అసలు మీటింగ్‌ని నడపడానికి కోరం కూడా లేకపోయింది. అయితే వాయిదా పడ్డ మీటింగ్‌లో కోరం అవసరం లేనందువల్ల మీటింగ్‌ని నడిపారు. సభ్యులు చాలా కొద్దిమందే రావడంతో ఆ వచ్చిన కొద్దిమందీ ఏ విషయంలోనూ ప్రత్యేకించి ఆసక్తి చూపించకపోవడంతోనూ మీటింగ్ సాఫీగా, నిర్విఘ్నంగా సాగిపోయింది. మంత్రిగారిని ఏ విధంగా, ఎవరి ద్వారా కలవాలనే విషయంలో అధ్యక్ష, కార్యదర్శులకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు సభ్యులు. అలాగే మంత్రిగారిని కలవడానికి అధ్యక్ష, కార్యదర్శులనే నియమించారు. క్రిందటి మీటింగ్‌లో మబ్బులాగా ముంచుకొచ్చిన ఆటంకాలు ఈసారి సమావేశంలో మంచువలె విడిపోయాయి.

* * *

అధ్యక్ష, కార్యదర్శులు క్రిందామీదా పడి వారినీ, వీరినీ పట్టుకొని ఎలాగైతేనేం... విద్యుచ్ఛక్తి శాఖామాత్యుల దర్శనం చేసుకుని వారిని తమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేయమని అర్థించారు.

అమాత్యులవారు ముందు 'అదుగో- ఇదుగో... చూస్తాను' అంటూ వాక్రుచ్చి చివరన తమకు ఎన్నికలు, ఎన్నో పనులూ, ఒత్తిడులున్నా వారికోసం ఎలాగో తప్పక వీలు చేసుకుని వస్తానని అభయమిచ్చారు. మంత్రిగారంతటివారు తమ వార్షికోత్సవానికి వస్తున్నందున సంఘంవారు ఘనంగా ప్రోగ్రాం కాగితాలను, ఆహ్వాన పత్రాలను అచ్చువేయించి కాలనీలోని అందరికీ మామూలుగానూ, కొందరికి ప్రత్యేకంగానూ పంచిపెట్టారు.

వార్షికోత్సవం మరొక్క రోజు ఉందనగా- అమాత్యులవారు తాము అనుకోకుండా ఢిల్లీ వెళ్లవలసి వచ్చిందనీ, అందువల్ల వార్షికోత్సవానికి తాము రాలేకపోతున్నామనీ విచారం వ్యక్తపరుస్తూ సందేశం పంపించారు.

ఆ సందేశం వినగానే అధ్యక్షులవారికీ, కార్యదర్శికీ గుండెల్లో రాయి పడింది. తాము పడ్డ శ్రమ అంతా వృధా అయిందని బాధపడ్డారు. పైగా... తమ శక్తిసామర్ధ్యాలను కించపరుస్తూ నలుగురిలో తాము నవ్వులపాలౌతామని విచారించారు.

'అమాత్యులవారు కొంపముంచారురా బాబూ..!' అనుకుంటూ మంత్రిగారు లేకపోయినా కనీసం ఎం.ఎల్.ఏ. గార్నైనా తీసుకురావాలని తాపత్రయ పడసాగారు. ఆదరా బాదరాగా ఎలాగైతేనేం... ఒక లేడీ ఎం.ఎల్.ఏ. గారిని పట్టుకున్నారు.

పాపం... ఆమె అట్టే బెట్టు చేయకుండానే రావడానికి ఒప్పుకుంది.

అన్నమాట ప్రకారం వార్షికోత్సవానికి వచ్చింది కూడా. అంతవరకూ ఆమె వస్తుందో-లేదో.., అమాత్యులవారిలాగా చివరి నిమిషంలో ఎక్కడ అదృశ్యమౌతుందోనని భయపడుతున్న సొసైటీవారు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

మంత్రిగారి రాకను దృష్టిలో ఉంచుకొని ఘనంగా చేసిన ఏర్పాటులో ఆ శాసనసభ్యురాలి సమక్షంలో వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వినతిపత్రంలో అమాత్యులవారి పేరు తీసేసి ఆమె పేరుంచి చదివి, ఆమె పలుకుబడి నుపయోగించి తమ కాలనీ అవసరాలకు- ముఖ్యంగా... వీధి దీపాలను మంజూరు చేయించవలసిందిగా కోరారు.

ఎం.ఎల్.ఏ. గారు వినతిపత్రాన్ని శ్రద్ధగా విని తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తాననీ, ఎలక్ట్రిక్ లైట్లు అక్కడ ఎలాగూ ఉన్నాయి కనుక, వీధి దీపాలు అతిత్వరలోనే వచ్చేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు.

సభికుల కరతాళధ్వనుల మధ్య ఆనాటి ఉత్సవం ఘనంగా ముగిసింది.

కొన్ని సందర్భాలలో వ్రతం జరిగినా ఫలితం దక్కదు. మరికొన్ని సందర్భాలలో వ్రతం చెడ్డా ఫలం దక్కుతూ ఉంటుంది. ఈ కాలనీ విషయంలో కూడా అంతే అయింది. మంత్రిగారు రాకపోయినా కావాలనుకున్న పని అయింది. పాపం... ఆ శాసనసభ్యురాలు శ్రద్ధ తీసుకొని, విద్యుచ్ఛక్తి బోర్డు వెంటపడి అతి త్వరలోనే కాలనీకి వీధి దీపాలు మంజూరు చేయించింది. వారం తిరక్కుండానే కాలనీలో వీధి దీపాలు అమర్చబడ్డాయి. సంఘంవారి ఆనందానికి అంతులేదు. వారు ఆమెకి కృతజ్ఞతలు తెలియజేశారు.

కాలనీకి అంత త్వరలోనే వీధి దీపాలు అమర్చబడడం ఎంతో ఘనవిజయంగా భావించారు సంఘంవారు.

అంతటి ఘన విజయానికి తగినట్లుగా వీధి దీపాలకు ఏ ప్రముఖ వ్యక్తి చేతనో స్విచ్ ఆన్ చేయించి ప్రారంభం చేయించాలని భావించారు. పైగా... సంఘం అధ్యక్ష,

కార్యదర్శులు తాము మంత్రిగారిని తీసుకురాలేనందుకు తమ ప్రతిష్ఠ దెబ్బ తిన్నదనీ, ఈసారి తీసుకురాగలిగితే దానిని పెంచుకోవచ్చుననే ఆలోచనలో ఉన్నారు. ఈ పరిస్థితులలో వారు సంఘ సభ్యుల అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు.

సమావేశంలో కొందరు విద్యుచ్ఛక్తి శాఖామాత్యుల పేరును సూచించారు. మరికొందరు విద్యుచ్ఛక్తి బోర్డు అధ్యక్షులైతే సబబుగా ఉంటుందన్నారు. ఇంకొందరు ఇంతటి ఘనకార్యాన్ని సాధించిపెట్టిన ఆ లేడీ ఎం.ఎల్.ఏ. గారి చేతనే ప్రారంభోత్సవం చేయిస్తే సబబుగానూ, సభ్యంగానూ ఉంటుందనీ, తమ కృతజ్ఞతలను వ్యక్తం చేసుకోవడానికి అంతకన్నా మంచి అవకాశం ఉండదనీ వాదించారు.

ఎప్పటిలాగే ఈ విషయంలో కూడా సభ్యులలో ఏకాభిప్రాయం కుదరలేదు. చివరికి సభ్యులు అధ్యక్ష, కార్యదర్శులను విద్యుచ్ఛక్తి బోర్డు అధికారులతో త్వరపడి లైట్లను ఆన్ చేయవద్దనీ, త్వరలోనే ప్రముఖ వ్యక్తి చేత వాటికి ప్రారంభోత్సవం చేయించ సంకల్పించామనీ, అంతవరకూ ఆగమని అభ్యర్థించమనీ ఆదేశించారు. ఎవరిచేత ప్రారంభోత్సవం చేయించాలనే విషయం తదుపరి సమావేశంలో నిర్ణయించాలని ప్రతిపాదించి ఆ సమావేశం వాయిదా వేశారు.

సభ్యుల ఆదేశం ప్రకారం అధ్యక్ష, కార్యదర్శులు విద్యుచ్ఛక్తి బోర్డు అధికారులతో మాట్లాడి, తమ సంకల్పం వారికి తెలియజేసి, కొద్దిరోజులు కాలనీలో లైట్లను వేయవద్దని కోరారు. అందుకు వారు కూడా ఒప్పుకున్నారు.

రోజులు మాత్రం గడిచిపోతున్నాయి.

కాలనీలో వీధి దీపాలు పడ్డా వాటికి వెలిగే యోగ్యత ఇంకా కలుగలేదు. ప్రారంభోత్సవం ఎవరిచేత చేయించాలనే విషయం ఇంకా నిర్ణయం కాలేదు. విద్యుచ్ఛక్తి బోర్డువారు కూడా- కాలనీ వారికి పట్టనప్పుడు తమకేమిటి? అని పట్టించుకోకుండా ఊరుకున్నారు.

వానాకాలం వచ్చేసింది. వానలు జోరుగా కురవసాగాయి. గడిచిన మూడు రోజులుగా ముసురు పట్టి వానలు దట్టంగా కురుస్తున్నాయి. కాలనీలోని గోతులన్నీ నీళ్లతో నిండిపోయాయి. ఏది రోడ్డో, ఏది స్థలమో, ఎక్కడ గోయి ఉందో తెలియరావడం లేదు.

ఆరోజు రాత్రి వాన బాగా కురుస్తోంది. ఆకాశం కారు మేఘాలతో ఉండడంతో అంతా చిమ్మచీకటిగా ఉంది. ఆరాత్రి ఆఫీసు నుంచి ఆలస్యంగా వస్తూ కంగారుగా ఇంటికి చేరే ప్రయత్నంలో కాలనీలో ఉండే ఒక వ్యక్తి- నీటితో నిండిపోయి, రోడ్డువారగానున్న ఒకనూతిలోకి పడిపోయాడు. అంతే... మళ్లీ లేవలేదు.

ఆ దుర్మరణ వార్తని పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. కాలనీలో వీధి దీపాలు ఏర్పాటుచేసి కూడా వాటిని విద్యుచ్ఛక్తి బోర్డువారు అశ్రద్ధతో వేయడంలేదనీ, వాటిని వేసి ఉంటే ఆ దుర్ఘటన జరిగి ఉండేది కాదని ఘాటుగా విమర్శించాయి.

తేలు కుట్టిన దొంగల్లాగా ఊరుకున్నారు- కాలనీ సంఘంవారు. నిష్కారణంగా వచ్చిన అపనిందకు చాలా బాధపడ్డారు విద్యుచ్ఛక్తి బోర్డువారు.

అంతే... ఆ మర్నాడే ఆ కాలనీలో వీధి దీపాల ప్రారంభోత్సవం జరిగింది- ఎవరికీ చెప్పకుండా, ఎవరినీ పిలవకుండా, ఏ సన్నాహమూ లేకుండానే.

ఆ ప్రారంభోత్సవం చేసినవాడు... ఒక లైన్‌మన్!

*- ఆంధ్రభూమి దిన పత్రిక... ఆదివారం 12 ఫిబ్రవరి '78*




**పర్వాలేదు**

డాక్టర్ : చూడండి మేడం... మీరు మీ భర్తకి దూరంగా ఉండడం అవసరం.

వనజ : ఎన్నాళ్లు?

డాక్టర్ : ఎన్నాళ్లోనా... జస్ట్- మూడు నెలలు!

వనజ : అయితే పర్వాలేదు. నా పాత బాయ్‌ఫ్రెండ్‌ని పిలుస్తాను. ఈ మూణ్ణెల్లూ అతను కంపెనీ ఇస్తాడు.



**ముచ్చటగా మూడు మాటలు**

రాజారావుది వన్ వే ట్రాఫిక్. ఎంతగా చీదరించుకుంటున్నా వెంకట లక్ష్మి వెంటపడుతూనే ఉండేవాడు.

ఒకరోజున ఆమె పార్క్‌లో ఒంటరిగా ఉండడం చూసి- "ప్రేయసీ... ముచ్చటగా మూడే మాటలు చెప్పు. అది విని నేను ఆనందంతో గాలిలో తేలిపోవాలి" అన్నాడు.

"వెళ్లి ఉరేసుకు చావు!" అంది వెంకట లక్ష్మి.